అక్టోబర్
2015

# 32

# కవితా!

సమకాలీన కవితల కాలనాళిక



చలసాని ప్రసాదరావు
27.10.1939 - 16.6.2002



అబ్బూరి వరదరాజేశ్వరరావు
10.10.1923 - 5.4.1993



'కవిత్వం' అనగా నేమి? కానిదేమి?
కవిత్వంలో కాలిక స్పృహ గురించి
ఉదాహరణలతో తెలియచేయండి ?



కవిత్వం : వెంటాడే జ్ఞాపకం



గుంటూరు శేషేంద్రశర్మ
20.10.1927 - 30.5.2007

# సాహిత్యంలో తిరోగమనం - పురోగమనం

"రాహువు పట్టిన పక్షాన
సెకండు అఖండమైనా
లోకబాంధవుడు అసలే
లేకుండా పోతాడా...?
మూర్ఖుడు గడియారంలో
ముల్లు కదలనీకుంటే
ధరాగమనమంతటితో
తలక్రిందైపోతుందా?
కుటిలాత్ముల కూటమికొర
కృతికాలం జయమిస్తే
విశ్వసృష్టి పరిణామం
విధ్వస్తం అవుతుందా?
దనుజలోకమేకంగా
దారికడ్డు నిలుచుంటే
నరజాతి ప్రస్థానం
పరిసమాప్తమవుతుందా ?"

– గుంటూరు శేషేంద్రశర్మ

# కవితా! 32

సమకాలీన కవితల కాలనాళిక

అక్టోబరు 2015

నిర్వాహక సంపాదకుడు : శ్రీశ్రీ విశ్వేశ్వరరావు

సెల్ : 94906 34849

సంపాదకుడు : బండ్ల మాధవరావు

సెల్ : 88976 23332

లే-అవుట్ : ఎ. గిరిధర్

సెల్ : 97042 44344

మాట్లాడండి ! రాయండి !! కలవండి !!!

సాహితీమిత్రులు

Regd. No. 48/2012/IV విజయవాడ.

28-10-26/1, మసీదు వీధి, అరండల్‌పేట, విజయవాడ - 2

ఫోన్ : 0866 2433359 సెల్ : 9392971359

kavita.viswam@gmail.com



కవులు, రచయితల అభిప్రాయాలు వారి వారి స్వంతం. అవన్నీ అనివార్యంగా పత్రిక అభిప్రాయాలు కానవసరం లేదు. - పబ్లిషర్స్





మనిషి మూలాలు పెకలింపబడుతున్న సందర్భంలో అనేక అస్థిత్వవాద ప్రశ్నలు తలెత్తుతాయి. నిర్మాణమైనా పునర్నిర్మాణమైనా ఒక విధ్వంసం తరువాతే జరుగుతుంది. అయితే ఆ విధ్వంసపు శిధిలాలో పడి నలిగి పోయిన జీవితాల తాలూకు శకలాలు పెనుభూతాలుగా ఆ విధ్వంసకారుల్ని చుట్టు ముడతాయి. నిర్మాణ పునర్నిర్మాణాలు ప్రగతి రథచక్రాలుగా భ్రమింపజేసే, మానవ జీవితాల్ని అతలాకుతలం చేస్తున్న శక్తుల పట్ల అప్రమత్తత కలిగి ఉండాలి. ప్రశ్నకు దాడి ప్రతిఫలమవుతున్న సమయంలో ప్రశ్నించే సమూహం ఏదైనా తన ప్రశ్నను మరింత పదునెక్కించాలి. రేపటి చుట్టు అలుము కొంటున్న చీకటిని పారదోలే ప్రయత్నంలో కొడిగడుతున్న దీపాల్ని కాపాడుకోవాలి. ప్రశ్న ఎప్పటికైనా జ్ఞానాన్ని ఆర్జించే ఆయుధం కావాలి.

## జ్ఞాపకాలు

ఈ నెలలో పుట్టిన
అబ్బూరి వరద రాజేశ్వరరావు,
చలసాని ప్రసాదరావు,
గుంటూరు శేషేంద్ర శర్మ లను,

ఈ నెలలో నిష్క్రమించిన
నార్ల చిరంజీవిని
జ్ఞాపకం చేసుకొందాం

# అందుకే

శ్రీకాంత్ కె.

నేను
నీ వాడినని ఎన్నడూ చెప్పలేదు
పూలల్లో దారం గుచ్చుకుంటూ నువ్వూ,
ఎన్నడూ అడగనూ లేదు -
ఇక
ఈ సాయంత్రాన్ని చీకట్లోకి తురుముకుని
నువ్వు చినుకులని వినే వేళ,
రాత్రి దారుల్లో నెత్తిన రుమాలుతో
ఒక్కడే
ఒక బాటసారి.
శరీరం తప్ప
ఆత్మ అంటూ ఏమీ లేని దేహధారి.
నీ సువాసనలో కాలి బూడిదై,
చుక్కలు ఇంకిన చినుకులతో,
గాలితో...రాలే ఆకులతో
గులకరాళ్ళకు పైగా,
చిన్ని చిన్ని చివుక్ చివుక్ శబ్దాలు చేసుకుంటూ
తనలో తాను మాట్లాడుకుంటూ
బహుశా
ఇటువంటి ఒక కవితను వ్రాసుకుంటూ
చీకట్లలో, పక్షులు బెంగగా
ముడుచుకున్న చెట్ల కింద నుంచి
వణుక్కుంటూ, గొణుక్కుంటూ
తనలో తాను నీరై పారిపోయే మనిషి -
బహుశా అతనికి నువ్వూ,
ఎన్నడూ తన దానివని చెప్పనూ లేదు.
బహుశా, అతనూ
ఎన్నడూ నిన్ను 'ఎందుకు?' అని అడగనూ లేదు.
బహుశా, అందుకే
పూలల్లో దారం గుచ్చుకుంటూ,
చిన్నగా పాడుకుంటూ
గడప వద్ద దీపపు కాంతిలో వెలిగిపోయే
-నువ్వు-
మరెక్కడో
తెంపబడిన పూల చీకట్లలో నేను! ■

# కవిత్వం రాద్దామని...

కాత్యాయనీ విద్మహే 9440550379

పచ్చని చెట్లను
పూల పందిళ్ళను
నక్షత్రాల దోసిళ్ళను
నిర్మలాకాశపు నిండు చంద్రుడి వెలుగులను
ఆవాహన చేసి
కవిత్వం రాద్దామని
కలం పట్టిన ప్రతిసారీ
దృశ్యం చెదిరి పోతుంది
పచ్చని చెట్టుకు
ఉరివేసుకొన్న రైతు శిరస్సు
చెప్పే రహస్యం
పూల పందిరికింద
విషంచిమ్మే పసరికలు
నేలరాలిన నీలి పారిజాతాలు
నిర్భయల నీడలు
రిషితేశ్వరి జాడలు
గుండెను తాకిన దిగులు మేఘాలవుతాయి
కవిత్వం కన్నీళ్ళలో కరిగిపోతుంది.

ప్రజాస్వామ్యంలో
ప్రశ్నలు
కొడవలితో తెగనరికిన
తలలై నేలరాలుతుంటే
కల్బుర్గీ ! కల్బుర్గీ
అంటూ గుండెకొట్టుకొంటుంది.
నా చైతన్యం చుట్టూ
కనిపించని తెరలు దిగి
వెన్నెల మసకేస్తుంది
కవిత్వం రెక్క తెగిన పావురమై
నేలరాలుతుంది.
సాగుభూమిని
సకల వనరులను
శ్రామిక జనాన్ని
ఆడవాళ్ళను
ఆత్మగౌరవాన్ని
అంతిమంగా మానవాత్మను
బలికోరుతున్న
విదేశీ పెట్టుబడుల మర్మాన్ని
రాజధాని హంగుల రాజకీయాన్ని
జీవితాల వెలుగులు దిగమింగి
వెలిగిపోతూ నీడలు కక్కే అభివృద్ధి మాయను
గురి చూసిన ఆయుధాలైన
అరుణతారలను
ఆశగా దోసిళ్ళకెత్తి
ముద్దాడుదామనుకొంటానా
ఖండిత దేహపు
నెత్తుటిగాయం పెదవికి సోకి
గుండె జలదరిస్తుంది
కవి కట్టటానికి
పేర్చుకొన్న శబ్దాలు, అర్థాలు
తూటా దెబ్బకు శకలాలు శకలాలై
కమురు కంపు కొడతాయి.
శృతీ ! శృతీ!
లయ తప్పిన రాజ్యంలో
కలలు కనే కళ్ళు
ప్రేమ నిండిన గుండె
పెకిలించబడి
పేల్చబడి
అడవి పుత్రిక అందం
విధ్వంసం చేయబడి
ఆడతనం
అవమానపరచబడి
గాజు పెట్టెలో
చలనం లేని
నీ శరీరం
ఆ మునిమాపువేళ
ఒక సంచలనమైంది
పోటెత్తిన
ప్రజా ప్రవాహం
దుఃఖ సముద్రమై
ధిక్కారపు పోరయింది.
కొత్త ఉదయం కోసం
కవిత్వం రెక్క కూడదీసుకొని
జమ్మి చెట్టుపై
వాలింది.


**రచనలకు ఆహ్వానం**

కవితలు, దీర్ఘకవితలు,
కవిత్వ విమర్శ వ్యాసాలు,
కవిత్వ పుస్తక సమీక్షలకు ఆహ్వానం

28-10-16, మసీదువీధి, అరండల్‌పేట,
కారల్‌మార్క్స్ రోడ్డు, విజయవాడ - 2
kavita.viswam@gmail.com



# దారి చూపండయ్యా

ప్రసాదమూర్తి 8498004488

ఈ మనసుకెప్పుడూ జ్వరం తగ్గదు
ఈ కనులకెప్పుడూ దాహం తీరదు
సేద తీర్చవే పిల్లా !
నీ పెదాలతో కరచిపట్టుకుని
నీ దేహంలో దాచిపెట్టుకుని.

నా చుట్టూ కళేబరాలు
నా ఆకాశంలో రాబందులు
మోయలేను ఈ శ్మశాన సంగీతాన్ని
తీరం చేర్చరా తమ్ముడా !
నీ పిడికిలి పడవలో కూర్చోపెట్టుకుని
నీ గుండె దీపాన్ని చేతపట్టుకుని.

తోడేళ్ళు తరుముతున్న మేకపిల్లలు
నా కళ్ళను తొక్కిపడేస్తున్నాయి
ఆకాశం దొరక్క ఏడుపు లంకించుకున్న
బుజ్జి మబ్బులు నన్ను వాటేసుకున్నాయి
నాకు నేనెంతగా భారమైపోయానో-
నీ భుజంపైకి చేర్చుకోరా హితుడా !
నీ అంబుల పొదిలో చోటిచ్చి
నీ మల్లెల మదిలో తావిచ్చి.

తప్పకుండా రోజూ తప్పే దారే ఇది
నా నుంచి నేను తప్పించుకు తిరిగే యవ్వారమే ఇది
వాన కురవని రోడ్ల మీద
కాసిన్ని కన్నీళ్ళుచల్లి నవ్వుకునే
బేవార్సుబాగోతమే ఇది
చేయి చాపవే చెట్టా !
పూల చూపులు పరుచుకుంటూ
కొమ్మ కౌగిలి విచ్చుకుంటూ.

చిన్నప్పుడే ఎదగడం ఆగిపోయినవాణ్ణి
ఇంకా నిద్రలో అమ్మా అని పలవరించేవాణ్ణి
ఇన్ని జెండాలు..ఇన్ని చట్టాలు..
ఇన్ని చట్టసభలు
ఇన్ని నక్కలు..ఇన్నినల్లులు..ఇన్ని బల్లులు
అమ్మో ఎప్పుడూ కళ్ళు మూసుకున్న
ఒంటరి వాక్యంలా వణికిపోయేవాడిని
దారి చెప్పవే చెల్లెలా !
నీ మాటల తాయిలం పెట్టి
నీ పాటల దువ్వెనతో దువ్వి.

కలల్ని కప్పుకుని తిరుగుతాను
కవితల్ని చెప్పుకుని బతుకుతాను
పిల్లల్నీ పువ్వుల్నీ
వొళ్ళంతా పూయించుకుని
భూగోళాన్నికౌగలించే చేతులతో
చేయి కలుపుతాను
పాటందుకోరా వీరుడా !
నీ అక్షరాల అడుగులకు
నన్ను నాడాగా తొడుక్కుని
నీ చూపుల రాత్రులకు
నన్ను అడవిగా వేలాడదీసుకుని. ■



# కవిత్వాన్ని గురించి...

హెచ్చార్కె

‘కవిత్వం’ అనగా నేమి? కానిదేమి? ఉదాహరణలతో విశదీకరింపుడు?

**– దేశరాజు రవి**

**హెచ్చార్కె :**

దేశరాజు రవి ఒక వర్కింగ్ జర్నలిస్టు. అట్టాంటి తను ఏ తెలుగు క్లాసు రూంలోనో వున్నట్టు ఆ ప్రశ్నను ఫ్రేమ్ చేయడం ఎందుకంటారూ? నా కైతే, ఇక కాన్లె సామీ, కొత్త టెక్ట్స్ బుక్కు రాయి... అని గేలి భాషలో హెచ్చరించినట్టు అనిపించింది. మంచి హెచ్చరిక. దీనికే కాదు, మరే ప్రశ్నకూ పాఠ్యగ్రంథాల భాషను వుపయోగించనని హామీ.

నిజంగా కవిత్వం అంటే ఏమిటి? ఏది కవిత్వం కాదో దాన్నుంచి కవిత్వాన్ని విడదీసేది ఏమిటి?

ఒక్క మాటలో జవాబు చెప్పాలనే ప్రయత్నాలు గతంలో జరిగాయి. జగన్నాథుని మాట తెలియని కవులుంటారని అనుకోను. రమణీయార్థమిచ్చే వాక్యమే కవిత్వం. రమణీయమంటే తప్పని సరిగా అందం అని కాదు. అందం అని మనం సాధారణంగా అనుకునేది వేరు, ఈస్తటిక్ సౌందర్యం వేరు. ఇది అందం కాదు గనుకనే, గుడిహాళం రఘునాథం వంటి కవి మిత్రులు అందం పద్యానికి అడ్డు పడుతోందని బాధ పడ్డారు. అందాన్ని అధిగమించి కవిత్వం రాయాలని ప్రత్యేకించి ప్రయత్నించిన కవులున్నారు. అందానికి మరీ ఎక్కువ విలువ ఇస్తున్నారని భావకవుల్ని... వాళ్ల జుంపాలూ జుబ్బాలతో సహా ఈసడించిన రోజులున్నాయి. దేర్ఫోర్, ఇక్కడ రమణీయమంటే అందం అని కాదు.

మన పూర్వీకులు.... జగన్నాథుని కంటే ముందు కూడా... కవిత్వం అంటే ఏంటో చెప్పడానికి చాల అటెంప్ట్స్ చేశారు, ఒకాయన వక్రోక్తి కావ్య జీవిత మన్నాడు. ఇంకొకాయన ఔచిత్యమే అన్నిటి కన్న ముఖ్యమన్నాడు. ఒకాయన ధ్వనికి సింహాసనం వేసి కూర్చోబెట్టాడు. ఏది ఏమైనా ఇట్టాంటి మాటలన్నీ గుర్తు చేసుకుంటే నాకు అనిపిస్తున్నది ఒక్కటే.

కవిత్వం అసాధారణమైన పలుకు (హైటెన్డ్ ఎక్స్ ప్రెషన్) అని.

నాకు నలుగురు తమ్ముళ్లు. వీళ్లు కాకుండా ఇంకో తమ్ముడుండే వాడు. ఒక సంవత్సరమో ఒకటిన్నర సంవత్సరమో వున్నాడు. వాడు చనిపోయే నాటికి నేను శైశవం దాటుతన్న పిల్ల వాన్ని. మా వేణుగోపాల్రెడ్డి పక్కన మంచం మీద కూర్చుని ఆ రాత్రంతా అమ్మ ఏడ్చింది. వాడు మరీ చిన్న పిల్లాడు కాబట్టేమో వాడి మరణాన్ని ఇంట్లో ఎవరూ సీరియస్ గా తీసుకోలేదు, అమ్మ తప్ప. ఆమె ఆ రాత్రంతా ఏడుస్తూ మాట్లాడిన మాటల్ని నేనెప్పటికీ మరిచిపోలేను. ‘నంద్యాల కాన్నుంచి మీ నాయ్న దెచ్చిన పాప్లినంగీ ఎవులికి తొడిగిచ్చుకుందురా’, ‘పెద్దన్నొచ్చినాడు, కల్లం కాడికి ఎత్తుకపోతాడంట లెయ్ రా’.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Kavitaa+32**

* * *